## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

# ధరణి పోతే దళారులే..

- హస్తం పార్టీకి బుద్ధి చెబుతామంటున్న రైతులు
- ధరణి పోర్టల్‌కు జేజేలు కొడుతున్న కర్షకలోకం

- పట్వారీ వ్యవస్థను తెచ్చేందుకు కాంగ్రెస్ కుట్ర
- వాళ్లొస్తే పటేల్ వద్ద చేతులు కట్టుకోవాల్సిందే..



### ధరణి ఉంటేనే బాగుంటుంది..

రైతులకు ధరణి ఎంతో అవసరం. ధరణి ఉంటేనే బాగుంటుంది దీని వలన రైతుల భూములకు ఎలాంటి ఢోకా లేదు. గతంలో పట్వార్లు ఉన్నప్పుడు తమ భూములు తెలియకుండానే డబ్బున్న వాళ్లు అధికారులకు డబ్బులు ముట్టజెప్పి భూములు మార్చుకున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. పదేండ్ల కిందట పట్వార్లు ఇష్టానుసారంగా ఒకరి భూమి ఒకరికి రాసి పంచాయతీలు పెట్టి కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగి అలిసిపోయి గ్రామాల్లో కొట్టుకొని చనిపోయిన ఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి. ధరణి వచ్చినంకా రైతులం ధీమాగా ఉన్నాం. మా భూమి ఇతరులకు అమ్మాలన్నా ఎవరి పేరుపైన భూమి ఉందో వారు పోయి సంతకం పెడితేనే మారుతది. ధరణి ఉంటేనే అందరికీ బాగుంటుంది.

**- గొర్ల సుల్తాన్, రైతు, తాడూరు**



### కాంగ్రెస్‌ది అవివేకం..

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సీఎల్పీ నేత బట్టి విక్క మార్క ధరణి తీసివేసి బంగాళఖాతంలో వేస్తాననడం ఆయన అవివేకానికి నిదర్శనం. ధరణి పోర్టల్ తీసేస్తే మళ్లీ రైతులు తాసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరగవలిసి వస్తుంది. ధరణి వలనే రైతులు భూములు వివరాలు కరెక్టుగా ఉన్నాయి. రైతులకు దళారులను ఆశ్రయించకుండానే రైతు బంధు డబ్బులు పడుతున్నాయి. దురదుష్టవశాత్తు రైతు చనిపోతే వచ్చే రూ.5 లక్షల రైతు బీమా కోసం దళారులను ఆశ్రయించాల్సి రాక తప్పదు. ధరణి పోర్టల్ వచ్చిన నాటి నుంచి రైతులకు భూ కొనుగోలు, విక్రయాలు సులభతరంగా మారాయి. మీ సేవలో స్లాట్ బుక్ చేసుకుంటే కేవలం అరగంటలోనే నేరుగా భూమి మన పేరు మీద పట్టా అవుతుంది. గతంలో పట్టా చేయించుకోవాలంటే గ్రామంలో మధ్యవర్తులకు ముడుపులు ఇచ్చి తాసీల్దార్ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగిపోయేలా తిరిగితేగాని పట్టా అయ్యేది కాదు. కేసీఆర్ సారు తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌తో మన వేలిముద్ర లేకుండా భూమి ఇతరుల పేరు మీదకు మారడం అసాధ్యం.

**- లండం యాదయ్య, యువ రైతు, ఆమనగల్లు మండలం**

### భూముల గోల్‌మాల్‌కు ఆస్కారం



ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతున్నది. ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తే పైరవీకారుల రాజ్యం మళ్లొస్తది. దీంతో దళారుల ప్రమేయం పెరిగి రైతుల భూములను గోల్‌మాల్ చేసే అవకాశం ఉంది. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో వ్యవసాయ భూములు భద్రంగా ఉన్నాయి. గతంలో యజమానికి తెల్వకుండానే భూమి ఇంకొకరి పేరు మీదికి మార్చేది. సీఎం కేసీఆర్ ఆలోచనతో ధరణి తీసుకొచ్చి రైతు ప్రమేయం లేకుండా మరొకరి పేరు మీదికి భూమి మార్చే వీలు లేకుండా ఉంది. స్వయంగా రైతు వెళ్లి వేలు ముద్ర వేస్తేనే రిజిస్ట్రేషన్ అయ్యేవిధంగా చేశారు. ధరణితో దర్జాగా ఉంటున్నాం. కాంగ్రెస్ పార్టీ వస్తే ధరణి రద్దు చేసి ఇబ్బందుల పాలు చేస్తారు. అందుకే సీఎం కేసీఆరే మళ్లీ రావాలి ధరణి ఉండాలి.

**-గోపాల్, చారకొండ, గ్రామం, మండలం**

### మళ్లీ భూ పంచాయితీలు వస్తయి..



ధరణితో రైతుకు భరోసా కలుగుతుందనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. వ్యవసాయ భూములపై యాజమాన్య హక్కులు ఉన్న వారందరూ ధరణి పోర్టర్‌లోకి రావడంతో అట్టి భూములు కొన్నా, అమ్మినా మ్యుటేషన్ నిమిషాల వ్యవధిలో పూర్తవుతుంది. ధరణి పోర్టర్ రద్దయితే డిజిటల్ రికార్డులు మాయం అవుతాయి. గ్రామాల్లో కొట్లాటలు, గొడవలు పెరిగిపోయి పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. గొడవలు, అవమానాలు భరించలేక ఎందరో రైతులు బలవన్మరణాలకు పాల్పడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి వ్యవస్థ బాగుంది. ధరణి తీసేస్తే దళారి వ్యవస్థ వస్తుంది.

**- సంగనమోని రంగస్వామి, యువరైతు తెల్లరాళ్లపల్లి, పాన్‌గల్ మండలం**

### కుట్రలను తిప్పికొడుతాం..



ధరణి తోనే భూములు సరైన భద్రత ఉంటుంది. మళ్లీ దళారి వ్యవస్థను తీసుకొచ్చి నిరుపేద రైతులను దోచుకునేందుకు కాంగ్రెస్ నాయకులు ధరణిని తేసేస్తామని కుట్రలు పన్నుతున్నారు. సీఎం కేసీఆర్ తెచ్చిన ధరణి పోర్టల్ ఎంతో బాగుంది. ఎలాంటి దళారుల ప్రమేయం లేకుండా భూముల రిజిస్ట్రేషన్లతోపాటు చిటికెలో మ్యుటేషన్ అయిపోతుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మొత్తం దళారుల రాజ్యమే ఉండేది. రైతులను మ్యుటేషన్, ఇతర భూ సమస్యల కోసం జనిగెల్లా పీల్చుక తినేవాళ్లు. రెవెన్యూ కార్యాలయాల చుట్టు ఏండ్ల తరబడి తిరిగిన పనులు, సమస్యలు తీరకపాయేవి. ధరణిని యథావిధిగా కొనసాగించాలి. ధరణి జోలి కొస్తే కాంగ్రెస్‌ను బొందపెడతాం.

**- ఈడుదులపల్లి శ్రీనివాసులు, రైతు, చొక్కన్నపల్లి, వెల్దండ మండలం**

### కౌలు చట్టంతో రైతుల్లో భయం..



తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణీ పోర్టల్‌తో మా భూములకు రక్షణ ఏర్పడింది. రైతు వేలి ముద్ర, సంతకం లేకుండా భూమి వేరొకరి పేరు మీదకి మారదు. ధరణితో అధికారుల మోసాలు, దళారుల సమస్య తప్పింది. భూమి అమ్మినా, కొన్నా సులువుగా రిజిస్ట్రేషన్ అవుతుంది. నిమిషాల వ్యవధిలోనే పట్టా చేసుకున్న వారి పేరుపై మ్యుటేషన్ అయిపోతుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని రద్దు చేస్తామని చెబుతున్నారు. మరచిపోయిన పట్వారి వ్యవస్థను తిరిగి తీసుకరావడానికి కాంగ్రెస్ నాయకులు చూస్తున్నారు. ధరణి రద్దుతో రైతులు తాసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. మళ్లీ దళారుల రాజ్యం వస్తుంది. కాంగ్రెస్ తెస్తామన్న కౌలు చట్టంతో పట్టాదారు రైతుల్లో భయం మొదలైంది. కౌలు ఒప్పంద పత్రంతో అనేక సమస్యలు వస్తాయి. కాంగ్రెస్ పార్టీ రైతులను ఆగం చేసేందుకు కుట్రలు పన్నుతున్నది. ధరణితో భూములకు భరోసా కల్పించిన సీఎం కేసీఆర్ సార్‌కే మా మద్దతు.

**- మూడవత్ శ్రీనునాయక్, కడ్తాల్ మండలం**

### పట్వారీ వ్యవస్థలో ఆగమైనం..



గతంలో పట్వారీల వ్యవస్థ ఉన్నప్పుడు అనేక ఇబ్బందులు పడి ఆగమైనం. భూమి రికార్డులను పైకి కిందికి చేసి రైతులకు ఆగం చేసిన్రూ. తనకు ఉన్న భూమిలో సగం భూమిని కొడుకుల పేరు మీద ఎక్కించుకోవాలంటే ఆఫీసుల చుట్టూ రోజుల తరబడి తిరిగి పడిగాపులు గాసినం. పట్వారీలను కలవడానికి ఊరు పెద్దమనుషులను వెంబడి తోలుకొని వెళ్తే పైసలు ఖర్చు అయినా పనులు మాత్రం కాకపోయేది. పట్వారి చెయ్యి తడపనిదే పనులు అయ్యేవి కావు. ధరణి ఫోర్టల్ వచ్చిన తర్వాత పనులు సక్రమంగా సకాలంలో అమలు అవుతున్నాయి. ధరణి పోర్టల్‌ను తీసేస్తామని కాంగ్రెసోళ్లు చెబుతున్నారు. ధరణి పోర్టల్ తీసేస్తే మళ్లీ పట్వారీ వ్యవస్థ వస్తే రైతులు ఇబ్బందులు పడడం ఖాయం.

**-బండారు యాదిరెడ్డి, రైతు, ధారారం, లింగాల మండలం**

### పోర్టల్ తీసేస్తే మళ్లీ పటేళ్లే..

తెలంగాణ ప్రభుత్వం పేద రైతుల కష్టాలను గుర్తించి బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని తెచ్చింది. దీని వలన పేదల భూములు భద్రంగా ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ధరణి రద్దు చేసి పాతపద్ధతి పెడతామని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పడం రైతులను మోసం చేయడానికే. వీఆర్వో వ్యవస్థ తెస్తామని రేవంత్‌రెడ్డి చెప్పడం రైతులకు ఇబ్బందులు కల్గించే మాటలు. రైతుల భూములు భద్రంగా ఉండాలంటే ధరణి ఉండాలి. రైతులు లోన్లకు వెళ్తే పైరవీ కారుల వద్దకు వెళ్లకుండా నేరుగా మీసేవ వద్దకు వెళ్లి రైతులు ఆర్వోఆర్ పహాణీ తీసుకొని బ్యాంకులకు వెళ్లి లోన్లు తెచ్చుకుంటున్నం. గతంలో పైరవీకారుల వద్దకు వెళ్లి వేలల్లో డబ్బులు ఖర్చు పనులు చేసుకునే వాళ్లం.

**- జాజాల సాయిబాబు, రైతు, తాడూరు**



### దళారుల దందా వస్తది..



దీర్ఘకాలిక ఆలోచనలో భాగంగా భూ సమస్యలకు శాశ్వత సమస్య పరిష్కారం కావాలని సీఎం కేసీఆర్ సార్ ధరణి పేరుతో భూ రికార్డుల ప్రక్షాళనతో సంస్కరణలు తీసుకువచ్చారు. దీంతో పటేల్, పట్వారి, రెవెన్యూ వ్యవస్థలో వీఆర్ఏ, వీఆర్వో, కంప్యూటర్ ఆపరేటర్ అంటూ దళారులకు అడ్డంగా ముట్టే డబ్బుల నుంచి విముక్తి పొందవచ్చు. ధరణిని తీస్తే మళ్లీ దళారుల దందా ప్రారంభమవుతుంది. ప్రతి సర్వే నెంబర్‌లో ఉన్న భూమిని టాలీ చేసి ప్రతి రైతుకు సంబంధించిన భూములను భూ రికార్డు ప్రక్షాళన చేసి నూతన పాస్ పుస్తకం తెలంగాణ ప్రభుత్వం అందజేసింది. దీంతో రైతులు ఎలాంటి ఆందోళన లేకుండా, బ్యాంకు రుణం, రైతు బంధు వంటి పథకాలను వినియోగించుకొని లబ్ధి పొందుతున్నారు. ప్రశాంతంగా ఉన్న రైతులను చిన్నాభిన్నం చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తూ.. ధరణిని రద్దు చేస్తామని చెప్పడం సరైనదికాదు.. సీఎం కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయితేనే రైతులు బాగుపడుతారు.

**- నరేందర్ (రైతు), వీపనగండ్ల, గ్రామం, మండలం**